




బయోగ్యం కానివి..!

అరుగాలం కష్టపడే అన్నదాతకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు కాగా మరో వైపు నకిలీ విత్తనాలు, మందులు తదితర వాటితో సైతం నిత్యం నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా ఒకప్పుడు నకిలీ బయో ఉత్పత్తుల తయారీకి, అమ్మకాలకు అడ్డాగా ఉండేది. అప్పట్లో ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపడంతో నకిలీ బయో ఉత్పత్తుల తయారీ అయితే తగ్గింది. కానీ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నేటికీ జిల్లాలో స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి నకిలీ మాఫియా రెచ్చిపోతున్నారు. వ్యవసాయాధికారులకు మామూళ్లు ఇస్తూ ఈ వ్యవహారం కొనసాగిస్తున్నారు. అలాగే డీలర్లకు అత్యధిక కమీషన్ల ఆశ చూపుతూ అమ్మకాలు చేపడుతున్నారు. ఇప్పటికీ ఏటా రూ.కోట్లలో నకిలీ బయో ఉత్పత్తుల వ్యాపారం కొనసాగుతుండటం గమనార్హం.

- నకిలీ బయో ఉత్పత్తులతో మోసపోతున్న అన్నదాతలు
- రెచ్చిపోతున్న వ్యాపారులు, తయారీదారులు
- పక్క రాష్ట్రాల నుంచి భారీగా సప్లయ్
- రెండు సీజన్లలో అమ్మకాలు రూ.100 కోట్లు పైనే
- కర్నూలు సమీప ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు
- ఫర్టిలైజర్ షాపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు
- డీలర్లకు భారీగా నజరానాలు
- మామూళ్ల మత్తులో వ్యవసాయ యంత్రాంగం

కర్నూలు అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ బయో ఉత్పత్తులతో అన్నదాతలు నిలువునా మునుగుతున్నారు. వ్యాపారులు, తయారీదారులు మాత్రం రెచ్చిపోతున్నారు. ఒకప్పుడు నకిలీ బయో ఉత్పత్తుల తయారీకి, అమ్మకాలకు ఉమ్మడి కర్నూలు జిల్లా అడ్డాగా ఉండేది. ముడి సరుకులను పక్క దేశాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని మారుమూల గ్రామాల్లో బిల్డింగ్‌లు, గోదాములను అద్దెకు తీసుకుని బయో ఉత్పత్తులను తయారుచేసేవారు. వాటిని రైతులకు అంటగట్టేందుకు ఏకంగా కొను గోలు కేంద్రాలు, స్టాక్ పాయింట్లను కూడా నిర్వహించేవారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నకిలీ బయోఉత్పత్తుల వ్యాపారం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వంద కోట్లకు పైగానే నిర్వహిస్తున్నారు. రసాయనాలు లేని బయో ఉత్పత్తులను రైతులకు అమ్ముకు నేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బయో ఉత్పత్తులకు గుట్టుగా కెమికల్స్‌ను కలిపి తయారీదారులు పెద్దఎత్తున రైతులకు వీటిని అంటగడుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయకుండానే..



ఈ చిత్రంలో కనిపిస్తున్న అంగడి బయట పురుగు మందులు, అదే విధంగా బయో ఉత్పత్తులు ఎంత పరిమాణంలో ఉన్నాయో వాటి ధరలు ఎంతో తెలిపే బోర్డు ఏర్పాటు చేయలేదు. ఈ దుకాణాలను పర్యవేక్షిస్తున్న కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డి మాత్రం ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేయాల్సిందేనని, తప్పనిసరిగా ఆ బోర్డుపై మందులు ఎంత పరిమాణంలో ఉన్నాయో, ఏ ధరకు అమ్ముతున్నారో నమోదు చేయాలని నోటీసులు కూడా డీలర్లకు అందజేసినట్లు స్పష్టం చేస్తున్నారు. కొత్తబస్టాండులో దాదాపు 20 అంగళ్లు ఉన్నాయి. ఎక్కడా క్రిమిసంహారక మందులు, బయో ఉత్పత్తులు ఏ కంపెనీలకు చెందినవి తమవద్ద ఉన్నదీ బోర్డు ఏర్పాటు చేయకపోవడం దారుణం. వ్యవసాయా ధికారులు తమను ఏమీ చేయలేరనే ధైర్యంతోనే డీలర్లు బోర్డులు ఏర్పాటు చేయకుండా నానా రకాల నకిలీ బయో ఉత్పత్తులు అమ్ముతున్నారని అనడానికి ఇదే సాక్ష్యం.

రైతులు మొగ్గు చూపుతుండటంపై...

జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌తో పాటు ఆ తర్వాత రానున్న రబీ సీజన్‌లో చౌకగా బయో ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో వీటి అమ్మకాలు వ్యాపారులకు, తయారీదారులకు కనకవర్షం కురిపిస్తున్నాయి. అమాయక రైతులు డీలర్లు, వ్యాపారుల మాటలు నమ్మి నకిలీ బయో ఉత్పత్తులను కొని వాటిని పంటలపై వినియోగిస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టినా ఈ బయో మందులు పనిచేయక కళ్ల ముందే పంట ఎండిపోతుంటే.. రైతులు మరో దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేకం.

ఉన్నతాధికారుల మాటలు..

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ శాఖ కమిషనర్‌గా పనిచేసిన మధుసూదన్ రావు నకిలీ బయో ఉత్పత్తుల తయారీదారులపై ఉక్కుపాదం మోపారు. కర్నూలు జిల్లాలో నకిలీ బయో ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని అప్పట్లో వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీదారులు, డీలర్ల నుంచి భారీగా మామూళ్లు అందుతుండటంతో వ్యవసాయాధికారులు రాష్ట్ర ఉన్నతాధి కారుల మాటల్ని, హెచ్చరికలను పెడచెవిన పెడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

న్యూస్ బాక్స్

పచ్చదనమే.. ప్రాణాధారం

నాబార్డు డీజీఎం సుబ్బారెడ్డి



మొక్క నాటుతున్న నాబార్డు డీజీఎం సుబ్బారెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): వాయు కాలుష్య నివారణలో పచ్చదనమే కీలకమని, పచ్చదనమే ప్రాణాధారమని నాబార్డు డీజీఎం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రాంగణంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు, నాబార్డు డీజీఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని తమ సామాజిక బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ప్రస్తుతం అడవులు అంతరించిపోతుండటంతో ప్రకృతి విపత్తులు జరుగుతున్నాయని, వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ అధికారి విజయకుమార్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల అభివృద్ధి అధికారి సుల్తానా బేగం, కల్లూరు సీఈవో రామాంజనేయులు, సిబ్బంది లక్ష్మీకాంతరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న జడ్పీ ఉద్యోగులకు కౌన్సెలింగ్

కర్నూలు న్యూసిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించి జూన్ ఒకటో తేదీన కౌన్సెలింగ్ జరగనుంది. ఈ మేరకు పరిపాలన అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు, రికార్డు, లైబ్రరీ, ల్యాబ్ అసిస్టెంట్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, స్వీపర్, వాచ్‌మెన్‌లు మొత్తంగా 134 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐదేళ్లు పూర్తి చేసిన వారు 57, ఐదు సంవత్సరాలు లోపు ఉన్న వారు 77 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ప్రాధాన్యత క్రమంలో బదిలీలు చేపట్టేవిధంగా ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. ఈ క్రమంలో అధికారులు కసరత్తు ప్రారంభించారు. జూన్ 2 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సిల్వర్ సెట్ ప్రశాంతం



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన సిల్వర్ సెట్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. కర్నూలులోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఎమ్మిగనూరులోని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన రెండు పరీక్షా కేంద్రాల్లో 90శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షలు నిర్వహణను ఆయనతో పాటు డీన్ డాక్టర్ మహ్మద్ వయీజ్ తదితరులు పరిశీలించారు.

ఆర్‌అండ్‌బీ శాఖలో బదిలీలు



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగులు

కర్నూలు అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వివిధ హోదాల్లోని ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. గురువారం ఉదయం కర్నూలులోని ఎస్ఈ కార్యాలయంలో కర్నూలు సర్కిల్, అనంతపురం నేషనల్ హైవేకు సంబంధించి నాన్ టెక్నికల్ సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఈ మహేశ్వరరెడ్డి, నేషనల్ హైవే ఎస్ఈ హరిప్రసాద్, నంద్యాల ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీరు శ్రీధర్‌రెడ్డి, కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ బదిలీలు జరిగాయి. సూపరింటెండెట్లు, సీనియర్ టెక్నికల్, అసిస్టెంట్ ఆఫీసర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగుల బదిలీలను పారద ర్శకంగా నిర్వహించినట్లు ఆర్‌అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్లకు సీట్ల కేటాయింపు

కర్నూలు హస్పిటల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ పరిపాలన విభాగంలో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు కొత్తగా సీట్లు కేటాయించారు. ఓ సీనియర్ అసిస్టెంట్ అనధికారికంగా గైర్హాజరు కావడంతో ఆ సెక్షన్ నిర్వహణ కష్టంగా మారింది. దీంతో అధి కారులు ఆ సెక్షన్‌ను రెండు విభాగాలుగా చేస్తూ ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు కేటాయించారు. హౌస్ సర్జన్ సీటును జూనియర్ అసిస్టెంట్ నవాజ్‌కు కీలకమైన పర్చేజ్ ఎక్విప్‌మెంటు సీటును జూనియర్ అసిస్టెంట్ చక్రిధర్‌కు ఇచ్చారు. పక్క కార్యాలయంలో సీట్లను మార్చాలని కొందరు ఉద్యోగులు కోరుతున్నా అవేవీ పట్టించుకోకుండా అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారు. ఓ సీనియర్ అసిస్టెంట్ తనకు అనుకూలమైన ఓ జూనియర్ అసిస్టెంట్‌కు ఆదాయం ఉన్న సీటును కేటాయించేలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డీసీసీబీ బ్యాంకు సంఘాల అభివృద్ధే లక్ష్యం



డీసీసీబీ సీఈవో రామాంజనేయులును సన్మానిస్తున్న కల్లూరు సంఘం సీఈవో పుల్లయ్య

కర్నూలు అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ బ్యాంకు సంఘాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో రామాంజనేయులు స్పష్టం చేశారు. గురువారం కర్నూలు నగరంలోని కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రాంగణంలో సీఈవో రామాంజనేయులుకు ఆ సంఘం సీఈవో పుల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంతకాలం సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన ఆప్కాబ్ అధికారి విజయకుమార్‌తో పాటు నాబార్డు డీజీఎం సుబ్బారెడ్డి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల అభివృద్ధి అధికారి సుల్తానా బేగం, సంఘం సిబ్బంది లక్ష్మీకాంతరెడ్డి, రిటైర్డు సీఈవో కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్‌లో 17 మంది డిబార్

కర్నూలు అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ 2, 6 వ సెమిస్టర్ పరీక్షల్లో 17మంది విద్యార్థులు డిబార్ అయ్యారని రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో 2వ సెమిస్టర్‌కు 9,579కిగాను 8,514 మంది, 6వ సెమిస్టర్‌లో 97 మందికిగాను 78మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 17 విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో డిబార్ చేశామని తెలిపారు.

స్థిరంగా పత్తి ధరలు

ఆదోని అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. గురువారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,919 పలికింది. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో పత్తి ధరలు పెరుగుతాయని రైతులు ఆశించారు. అయినా ధరలు పెరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా 147 క్వింటాళ్ల విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.6,002, గరిష్ఠంగా రూ.7,919, మధ్యస్థంగా ధర రూ.7,620 పలికింది.

పైసలు.. పైరవీలు..!

- యార్డులో పోస్టులకు డిమాండ్
- సెక్రెటరీ పోస్టుకు రూ.లక్షల్లో ముడుపులు?

7

హామీల అమలులో బీజేపీ విఫలం

సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు

8 స్కానింగ్ కేంద్రాలకు సిఫారసు

వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం



జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హస్పిటల్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 8 స్కానింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం డీఎంహెచ్‌వో అధ్యక్షతన జరిగింది. కొత్తగా 8, రెన్యువల్ కోసం 17 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి కోసం సిఫారసు చేశామని డీఎంహెచ్‌వో వెల్లడించారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, సరియైన వివాహ వయస్సుపై అవగాహన కోసం ఎన్జీవోల సహకారం తీసుకోవాలన్నారు. ఆడపిల్లల నిష్పత్తి తక్కువ ఉన్న మండలాల్లో డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కాలేజీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీపీఎన్‌డీ యాక్టు జిల్లా నోడల్ ఆఫీసర్ డా. నాగప్రసాద్, కర్నూ లు జీజీహెచ్ చెందిన పీడియాట్రిక్, గైనిక్, రేడియాలజీ హెచ్‌వోడీలు డా.బి. విజయానందబాబు, డా. శ్రీలక్ష్మి, డా. రాధారాణి, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాదర్ బాషా, ఎన్జీవో సభ్యులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దివాకర్ పాల్గొన్నారు.

ఉల్లి ప్లాట్‌ఫారాలు ఖాళీ

వారం నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు రాని ఉల్లి దిగుబడి



ఉల్లి సంచులు నిల్వ లేక ఖాళీగా కనిపిస్తున్న ప్లాట్‌ఫారం

కర్నూలు అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లి దిగుబడి విక్రయానికి రావడం లేదు. రాష్ట్రంలోనే అత్యధికంగా 50వేల హెక్టార్లలో ఏటా ఉమ్మడి జిల్లాలో ఉల్లి సాగవుతోంది. అదే విధంగా రాష్ట్రంలో కర్నూలు మార్కెట్ యార్డుతో పాటు తాడేపల్లి గూడెంలో ఉల్లి విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. కర్నూలు మార్కెట్‌యార్డుకు ఆగస్టు నుంచి డిసెంబరు దాకా వేల క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్మకానికి తెస్తుంటారు. ఈ ఉల్లిని అమ్మించే విషయంలో అధికారులు, సిబ్బంది కిందా మీద పడుతూ ఊపిరి సలపకుండా పనిచేస్తుంటారు. గత అక్టోబరు, నవంబరు నెలలో ప్రతిరోజు కర్నూలు మార్కెట్ యార్డుకు 5వేల నుంచి 10వేల క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి రైతులు ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు, లారీల ద్వారా తీసుకు వస్తుంటారు. దీంతో కర్నూలు కొత్తబస్టాండు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడి తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. వారం రోజుల నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో ఒక్క ఉల్లి సంచి కూడా లేకపోవడంతో ప్లాట్ ఫారాలన్నీ బోసిపోతున్నాయి. అధికారులు, సిబ్బంది కనీసం ఒక పది రోజులైనా ఉల్లి మార్కెట్ యార్డుకు రావడం లేదని, జూలై ఆఖరు నుంచి తిరిగి ఉల్లి విక్రయానికి రావడం మొదలవుతుందని అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏటా ఉల్లి క్రయ విక్రయాల వల్ల కర్నూలు మార్కెట్ యార్డుకు రూ. కోటికి పైగానే వ్యాపారుల నుంచి సెస్సు రూపంలో ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం ఉల్లి జాడ లేకపోవడంతో కార్మికులకు పని లేకుండా పోయింది.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు




మహా జాతర




కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం







జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

కర్నూలు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు లేదా కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వుల్లో తెలియజేశారు. ప్రస్తుతం మే31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో మోహన్‌తేజకు గోల్డ్ మెడల్

అభినందించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం అందుకుంటున్న కోవెలకుంట్ల వాసి మోహన్‌తేజ

కోవెలకుంట్ల, మే 29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఓపెన్ బాక్సింగ్ పోటీల్లో కోవెలకుంట్లకి చెందిన మోహన్‌తేజ గోల్డ్ మెడల్ సాధించారు. గోవాలోని కాలింగోట్‌లో జరిగిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఏపీకి చెందిన బాక్సింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మోహన్‌తేజ బంగారు పతకం సాధించినట్లు కోచ్ ఫయాజ్ గురువారం తెలిపారు. బెస్ట్‌ఫైటర్ అవార్డుతో పాటు టీం చాంపియన్ షిప్ మోహన్‌తేజ కైవసం చేసుకున్నారన్నారు. జాతీయస్థాయి పోటీల్లో అద్భుతప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించిన చెందిన మోహన్‌తేజను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అభినందించారు. అతడు భవిష్యత్‌లో మరింత కష్టపడి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

బయోగ్యం కానివి..!

(5వ పేజీ తరువాయి)



గతంలో దిన్నెదేవరపాడులో హైవే పక్కనే ఉన్న గోదాములో హైదరాబాదుకు చెందిన వ్యక్తులు అద్దెకు తీసుకుని చైనా నుంచి ముడి సరుకులు తెప్పించి బాసిల్ అనే ప్రముఖ సంస్థ పేరుతో నకిలీ బయో ఉత్పత్తులు తయారుచేస్తుండగా విజిలెన్స్ అధి కారులు దాడులుచేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2 కోట్లుపైనే ఉంటుందని అప్పట్లో అంచనా వేశారు. కర్నూలు బాలాజీనగర్ కేశవరెడ్డి స్కూల్ సమీపం లోని గోదాముల్లో రూ.25 లక్షలు విలువ చేసే బయో మందులను (ఓసో కంపెనీ పేరుతో ఉన్న) క్రాంతి ట్రాన్స్‌పోర్టు ద్వారా తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమాచారం తెలుసుకుని వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకున్నారు. పందిపాడు వద్ద ఒక పాతబిల్డింగులో ఉన్న రూ.10 లక్షలు విలువచేసే నకిలీ ఉత్పత్తులను స్వాధీ నం చేసుకున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో కల్లూరు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కర్నూలు నగర శివారులోని బళ్లారిచౌరస్తా, ఉల్చాల, పందిపాడు తదితర గ్రా మాల్లో నకిలీ బయోఉత్పత్తులను గోదాముల్లో నిల్వచేసి స్థానిక పురుగుమందుల అంగళ్లకు చేరవేస్తున్నట్లు సమాచారం.

కొరవడిన నిఘా

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నకిలీ బయోఉత్పత్తులు డీలర్లు రైతులకు అంటగడు తున్నారు. వీటితో రైతులు నష్టపోతూనే ఉన్నా వ్యవసాయ యంత్రాంగం మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఎక్కడైనా ఈ నకిలీ బయో ఉత్పత్తులు పట్టుబడితే జిల్లా అధికారులు కింది స్థాయి సిబ్బందికి మెమోలు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. వీటి నకిలీ బయో ఉత్పత్తులను గతంలో కొంత మంది రైతులకు అమ్మేందు కోసం కర్నూలుతో పాటు పక్కనే ఉన్న అలంపూర్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఏకంగా స్టాక్ పాయింట్లను కూడా ఏర్పాటుచేసుకుని ఏకంగా కొనుగోలు కేంద్రాలను తెరిచారు. వివిధ రాష్ట్రాల్లో, కోస్తా జిల్లాలో, హైదరాబాదు పరిసరాల్లో ఈ నాసిరకం బయో ఉత్పత్తులను తయారుచేసి వాటిని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డీలర్లకు చేరవేసి పెద్దఎత్తున రైతులకు అంటగట్టేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు. రూ.100లు విలువ చేసే బయో బాటిల్‌ను డీలర్లతో రైతులకు రూ.50కే అమ్మించి మిగిలిన రూ.50ను వారికి కమిషన్‌గా ఇస్తూ తమ ఉత్పత్తులను భారీగా అమ్ముకుంటున్నారు.

విజిలెన్స్ అధికారులు స్పందిస్తేనే...

విజిలెన్స్ విభాగం అధికారులు కూడా నకిలీ బయో ఉత్పత్తుల స్వాధీనానికి పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదనే ఫిర్యాదులు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఏటా రైతులు ఈ నకిలీ బయో ఉత్పత్తులపై ఆధారపడుతూ పంటలను నష్టపోతున్నారు. ఇప్పటికైనా నకిలీ బయో ఉత్పత్తుల స్వాధీనానికి విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ యంత్రాంగం సమన్వయంతో పనిచేసి తయారీదారులతో పాటు వీటి అమ్మకా లు చేపట్టిన డీలర్ల భరతం పట్టాలని అన్నదాతలు కోరుకుంటున్నారు.

ఉక్కుపాదం మోపుతాం



ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండటంతో నకిలి బయో ఉత్పత్తుల తయారీతో పాటు వీటి అమ్మకాలను చేపడుతున్న డీలర్లపై ఉక్కుపాదం మోపేం దుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి అకస్మిక తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా ఈ నకిలీ బయో ఉత్పత్తులు పట్టుబడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. డీలర్ల లైసెన్సులు కూడా రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- వరలక్ష్మి, జేడీ వ్యవసాయ శాఖ

స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం

ఎమ్మిగనూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉత్తమ మున్సిపాలిటీగా పేరొందిన ఎమ్మిగనూరుకు ఎట్టకేలకు ప్రమోషన్ లభించింది. గ్రేడ్-1 ఉంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ స్థాయికి చేరుకుంది. ఈమేరకు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా స్థాయిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మిగనూరు 1937నుంచి 1956వరకు గ్రామపంచాయతీగా కొనసాగింది. 1956నుంచి 1964వరకు మేజర్ గ్రామ పంచాయతీగా ఉంది. అనంతరం 1965 ఏప్రిల్ 1న ఎమ్మిగనూరు పట్టణాన్ని 19 వార్డులతో ఏర్పాటు చేసి మూడో శ్రేణి మున్సిపాలిటీగా మార్చారు. దాదాపు 20 ఏళ్ల తరువాత 1984లో అప్పటి మంత్రి బీవీ మోహన్ రెడ్డి కృషి ఫలితంగా గ్రేడ్-2 మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 32 వార్డులుగా ఏర్పాటైంది. మరో పదేళ్లకు 1996లో గ్రేడ్-1 మున్సిపాలిటీగా స్థాయిపెరిగింది. తర్వాత స్పెషల్ గ్రేడ్‌గా గుర్తించాలని ప్రజాప్రతినిధులు ప్రయత్నించారు. అయితే అందుకు తగ్గ అర్హత ఎమ్మిగనూరుకు లేదని కొందరు కోర్టుకు వెళ్లడంతో స్పెషల్ గ్రేడ్ హోదాకు బ్రేక్ పడింది. ఈ తరుణంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషితో 29 ఏళ్ల తరువాత ఎమ్మిగనూరుకు స్పెషల్ గ్రేడ్ హోదా దక్కినట్లయింది. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ స్థాయి పెరగటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లోని స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల్లో చోటు దక్కుతుంది. దీంతో పట్టణానికి అమృత్ పథకం కింద తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లతో పాటు వివిధరకాల సౌకర్యాలకు విరివిగా నిధులు మంజూరవుతాయి. అంతేగాక స్మార్ట్ సిటీ కింద పట్టణాన్ని మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ప్రతి ఏటా కేంద్రం విడుదల చేసే ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులు దాదాపు 50 శాతం పెరగనున్నాయి. వీటితో పాటు మున్సిపాలిటీలో సిబ్బంది సంఖ్య కూడా పెరుగుతుంది. ప్రధానంగా అసిస్టెంట్ కమిషనర్, ఈఈ, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌తో పాటు మరో డీఈ పోస్టు కూడా రానున్నాయి.

మల్లన్నకు స్వర్ణ కానుకలు


ఆలయ అధికారులకు బంగారు విభూతి రేఖలు, ముక్కెరను అందజేస్తున్న దాత నారాయణమూర్తి

నంద్యాల కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం దేవస్థానానికి తిరుపతికి చెందిన భక్తుడు కేఆర్ నారాయణమూర్తి 4.2 తులాలతో చేయించిన బంగారు విభూతి రేఖలు, భ్రమరాంబదేవి అమ్మవారికి ముక్కెరను సమ ర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు సమర్పించిన బంగారు విభూతిరేఖలను శ్రీశైలం మల్లికార్జున స్వామికి, బంగారు ముక్కెరకు పూజలుచేసి భ్రమరాంబదేవి అమ్మవారికి అలంకారంగా ఉపయోగిస్తామ న్నారు. వీటిని దాతలు ఆలయ పర్యవేక్షకులు రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ సా విత్రి, సహాయ ప్రజా సంబంధాల అధికారి శివారెడ్డికి అందజేశారు. అనంతరం దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.


ఈ నెల 17వ తేదీన నీరు లేక ఇసుక తిన్నెలు, రాళ్లు కనిపిస్తున్న ఆర్డీఎస్ ఆనకట్ట


ప్రస్తుతం తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టపై వరద ఉధృతి

రెండు వారాల్లో...

- ఆర్డీఎస్ ఆనకట్టకు పెరిగిన వరద
- తుంగభద్రకు పోటెత్తిన వరద నీరు

కోసిగి, మే 29 (ఆంధ్రజ్యోతి): రెండు వారాల క్రితం చుక్క నీరు లేక ఎండిపోయిన ఆర్డీఎస్ ఆనకట్ట ప్రస్తుతం వరద ప్రవాహంతో కళకళలాడుతోంది. ఈ నెల 17 వరకు తుంగభద్ర నదిలో చుక్క నీరు లేక ఇసుక తిన్నెలు, రాళ్ల రప్పలతో ఆర్డీఎస్ ఆనకట్ట కళతప్పి వెలవెలబోయింది. పశ్చిమ ప్రాంతంతో పాటు ఎగువ ప్రాంతమైన కర్ణాటక రాష్ట్రంలోనూ కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్డీఎస్ ఆనకట్ట నిండుకుండలా దర్శనమిస్తోంది. ప్రతి ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలో ఆర్డీఎస్ ఆనకట్టపై నుంచి వరద ఉప్పొంగేది. తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల చేసినప్పుడు మాత్రమే ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి నీరు దిగువకు ప్రవహిస్తుండేది. ఈ ఏడాది ముందస్తు వర్షాలు పడటంతో కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు పోటెత్తింది. దీంతో నదితీర గ్రామాల ప్రజలు, రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

మహానాడు విజయోత్సాహం



జిల్లా ఇన్‌చార్జి మంత్రితో తిక్కారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, ఎన్. రాఘవేంద్రరెడ్డి

• బహిరంగ సభకు భారీగా తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

కర్నూలు, మే 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణుల మూడు రోజుల పండుగ గురువారం ఘనంగా ముగిసింది. కడప గడ్డపై జరిగిన మహానాడు భారీ బహిరంగ సభకు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వేల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. సభ ముగియగానే తమకే కేటాయించిన బస్సుల్లో స్వగ్రామాలకు బయలుదేరారు. మహానాడు నిర్వహణ వివిధ బాధ్యతలు చేపట్టి సక్సెస్ చేసిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి తదితరులను సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ అభినందించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాం బాబు, గౌరు చరితారెడ్డి, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఆదోని, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, మాధవరం రాఘవేంద్రరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సహా నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు, నాయకులు తరలివెళ్లారు.



డోంట్ వర్రీ.. మీనాక్షినాయుడితో చంద్రబాబు



హ్యాపీ సార్.. సీఎంతో వీరభద్రగౌడ్



కార్యకర్తలకు వీడ్కోలు.. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రతో బీటీ నాయుడు



హౌ ఆర్‌యూ.. తుగ్గలి నాగేంద్రతో లోకేష్



శ్రద్ధగా వినాలి.. మంత్రి టీజీ భరత్



మహానాడులో మంత్రులు: సభావేదికపై మంత్రులు బీసీ, ఫరూక్

పైసలు.. పైరవీలు..!

• యార్డులో పోస్టులకు డిమాండ్

• సెక్రెటరీ పోస్టుకు రూ.లక్షల్లో ముడుపులు?



నంద్యాల మార్కెట్ యార్డు

నంద్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు పోస్టింగ్‌ల కోసం పైరవీలు మొదలెట్టారు. ఒక్కో పోస్టు రూ. లక్షల్లో పలుకుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు సైతం పైసలిస్తే.. పోస్టింగ్‌కు సిఫారసు చేస్తామని అన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజులు విజయవాడలో జరిగిన కౌన్సిలింగ్‌కు నాయకుల సిఫార్సులతో అధికారులు హాజరైనట్లు సమాచారం. కానీ ఇప్పటి వరకు వారికి ఉత్తర్వులు అందలేదు. ఉమ్మడి జిల్లాలోని ఆదోని, నంద్యాల, కర్నూలు మార్కెట్‌యార్డుల సెక్రటరీ పోస్టులు ఎవరికి దక్కుతాయనే విషయంలో ఆ శాఖ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు- 07, నంద్యాల -08 చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలో 15 మార్కెట్ యార్డులు ఉన్నాయి. అయితే ఇందులో ఆదోని, కర్నూలు, నంద్యాల మార్కెట్ యార్డులకు మాత్రం డిమాండ్ ఉంది. అయితే ఆదోని సెక్రటరీ ఇటీవల రిటైర్ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టు రాష్ట్రంలోనే ప్రధానమైన వాటిలో ఒకటి. ఇలాంటి పోస్టుకు ముగ్గురు అధికారులు పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఆ తర్వాత కీలకమైనది కర్నూలు మార్కెట్‌యార్డు సెక్రటరీ పోస్టు. ఇక్కడ అనంతపురం మార్కెట్ యార్డు అధికారి ప్రస్తుతం ఇన్‌చార్జి సెక్రటరీగా (ఓడీలో) పనిచేస్తున్నారు. ఇక్కడి రెగ్యులర్ అధికారి అనంతపురం యార్డులో ఇన్‌చార్జిగా (ఓడీ) రూపంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కర్నూలు ఇన్‌చార్జి హోదాలో పనిచేస్తున్న సదరు సెక్రటరీనే రెగ్యులర్‌గా తెచ్చుకోవాలని ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే రెగ్యులర్ స్థానం కలిగిన అధికారి(అనంతపురంలో పనిచేసే) సైతం ఈ బదిలీల్లో యథాస్థానానికి రావాలని యాచిస్తున్నట్లు తెలిసింది. సాధ్యపడకపోతే.. నంద్యాలకు లేదా. ఆదోనికి పోస్టింగ్‌కు ఇవ్వాలని ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో సదరు అధికారి మొర పెట్టుకున్నట్లు సమాచారం.

కౌన్సెలింగ్ జరిగినా..

వాస్తవంగా ఈనెల ఆఖరికి బదిలీ ప్రక్రియ కొలిక్కి రానుంది. అయితే.. మార్కెటింగ్ శాఖ అధికారులు ఈనెల 22వరకు ఆప్షన్ ఇచ్చారు. ఆ తర్వాత 26, 27వ తేదిలో విజయవాడలో డైరెక్టర్ విజయసునీత కౌన్సెలింగ్ పూర్తి చేశారు. అయితే.. ఈ ఉమ్మడి జిల్లాలోని ఈ మూడు సెక్రటరీ పోస్టుల ఎంపికపై ఆ శాఖ మంత్రి సంతకం కూడా ఉండాలి. సదరు మంత్రి మహానా డులో ఉండటంతో ఉత్తర్వులు జాబితా జాప్యమవుతోంది. ఎవర్ని ఎక్కడికి బదిలీ చేశారో..? ఎవరికి ఎక్కడ పోస్టింగ్ ఇచ్చారో...? ఎవరి ప్రయత్నం ఫలించిందో...? ఇప్పటికీ తెలియకపోవడంతో పరిస్థితి ఉత్కంఠ భరితంగా ఉంది. ఈ పోస్టుల ఎంపికపై మరో రెండు రోజుల్లో స్పష్టత రావచ్చు.

ఆ రెండు పోస్టులకు రూ.లక్షల్లో..?



అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆదోని మార్కెట్‌యార్డు సెక్రటరీ పోస్టుపై ముగ్గురు అధికారులు కన్నేశారని తెలిసింది. ఈ పోస్టు పొందాలంటే సుమారు రూ. 7 లక్షల నుంచి రూ. 10లక్షలు వెచ్చించాల్సి వస్తోందని తెలిసింది. అయినప్పటికీ ముగ్గురు అధికారులు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. ఉమ్మడి జిల్లాలోని ఓ సెక్రటరీ, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇద్దరు సెక్రటరీలు తీవ్ర స్థాయిలో పోటీ చేసినట్లు తెలిసింది. కర్నూలు జిల్లాకు పడమర దిశలో పనిచేస్తున్న సెక్రటరీ కూడా అడిగినట్లు సమాచారం. ఇదే తరహాలో కర్నూలు మార్కెట్‌యార్డు సెక్రటరీ పోస్టు కూడా రూ. 5 నుంచి రూ.7లక్షలు వెచ్చించాల్సి వస్తోందని ఆ శాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో అక్కడే ఇన్‌చార్జిగా పనిచేస్తున్న అధికారి రెగ్యులర్ కావడం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కాకపోతే.. ఇక్కడి రెగ్యులర్‌గా ఉండి.. గతంలో భంగపాటుకు గురైన అనంతపురంలో ఇన్‌చార్జి సెక్రటరీగా పనిచేస్తున్న అధికారి తనను రెగ్యులర్ స్థానమైన కర్నూలులోనే ఉంచాలని కోరినట్లు సమాచారం. లేకపోతే.. నంద్యాల, ఆదోని పోస్టుల్లో ఎక్కడైనా కేటాయించాలని కౌన్సిలింగ్‌లో కోరినట్లు తెలిసింది. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో పనిచేసే మరో సెక్రటరీ కూడా కర్నూలుకు ట్రై చేస్తున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో నంద్యాలకు విజయవాడ పరిసర ప్రాంతాల్లో పనిచేసే మరో సెక్రటరీ(ఇద్దరిలో ఒకరు) అటు ఫలించకపోతే..కనీసం నంద్యాలకు అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అనుకున్న విధంగా జరగకపోతే.. ఆదోని తప్ప.. మిగిలిన ఇద్దరు సెక్రటరీలు యథాస్థానంలో ఉండాలని కూడా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తాము కోరుకున్న చోటికైతే వెళ్తాం.. లేకుంటే ఇక్కడే ఉండిపోతాం అన్నట్లుంది ఇద్దరు సెక్రటరీల పరిస్థితి.

సమష్టి కృషితోనే
సహకార బ్యాంకు ముందంజ : జేసీ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

కర్నూలు అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన అన్ని ప్రయోజనాలు అందించడంలో ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముందంజలో ఉందని, దీని కోసం బ్యాంకు అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పరస్పర సహకారంతో కృషి చేశారని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య తెలిపారు. గురువారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న రామాంజనేయులు బాధ్యతలు తీసుకున్నారు. అదే విధంగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించిన విజయకుమార్ తన మాతృ సంస్థ ఆప్కాబ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్‌కు సన్మాన కార్యక్రమం బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేసీ నవ్య మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధి పథంలో కొనసాగేలా పని చేసేందుకు అధికారులు, సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంట రుణాలను దీర్ఘకాలిక రుణాలను వేగవంతంగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డీఎం శివలీల, నాగిరెడ్డి, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా టీడీపీ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ జీవో.నెం. 350ని గురువారం విడుదల చేశారు. ఈఉత్తర్వులు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు అందాయి.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి



వేదవతి(ఫైల్)

పెద్దకడబూరు, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని బసల దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లికార్జున, జ్యోతి దంపతుల కుమార్తె వేదవతి(6) ఆడుకుంటూ ఇంటి వెనకాల ఉన్న ఎర్త్ వైర్‌ను ముట్టుకుంది. ఎర్త్ వైర్‌కు కరెంట్ సరఫరా ఉండడంతో షాక్‌కు గురైంది. అక్కడే బట్టలు ఉతుకుతున్న తల్లి జ్యోతి గమనించి ప్రాణాలకు తెగించి చిన్నారిని పక్కకు లాగింది. అపస్మారక స్థితిలో ఉన్న వేదవతిని ఆదోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి తాత బసలదొడ్డి ఈరన్న టీడీపీ కన్వీనర్. కుటుంబసభ్యులు సమాచారం అందించడంతో కడపలో జరుగుతున్న మహానాడు నుంచి ఆయన స్వగ్రామానికి చేరుకున్నాడు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

హత్యాయత్నం కేసులో జైలుశిక్ష

అవుకు, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన కట్టెల వెంకటేశ్వర్లుకు ఓ హత్యాయత్నం కేసులో 3 సంవత్సరాలు జైలు శిక్షను జిల్లా కోర్టు విధించినట్లు ఎస్ఐ రాజారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అవుకు పట్టణం మార్కెట్ వీధికి చెందిన కంచర్ల లక్ష్మీదేవిపై ఒక వివాదంలో వెంకటేశ్వర్లు మచ్చుకత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో నేరం రుజువు కావడంతో 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించటంతో నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



డోన్ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం.నెం.4, 5 గుంతకల్లు వైపు ఉన్న ఫుట్ వే బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తి బ్లూకలర్ ఫుల్ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, 5.4 అడుగులు, చామనఛాయ రంగులో ఉన్నాడని అన్నారు. వయసు 45 ఏళ్లు ఉండవచ్చని. వివరాలు తెలిసిన వారు 9030481295 నెంబరును సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖాజీపేటలో చోరీ

• నాలుగున్నర తులాల బంగారు, రూ.40 వేలు అపహరించిన దొంగలు

మిడుతూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపేట గ్రామానికి చెందిన పాణ్యం నాగలక్ష్మమ్మ ఇంట్లో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. వివరాలివీ.. ఖాజీపేట గ్రామానికి చెందిన పాణ్యం నాగలక్ష్మమ్మ కుమారుడు సుదర్శన్ రెడ్డి నందికొట్కూరు పట్టణంలో ఆటో మొబైల్ వ్యాపారం చేస్తున్నారు. నాగలక్ష్మమ్మ ఖాజీపేట గ్రామం నుంచి నందికొట్కూరుకు కుమారుడి దగ్గరకు ఈనెల 27వ తేది సాయంత్రం వెళ్లారు. 29వ తేది ఉదయం నాగలక్ష్మమ్మకు రోజు పొలం పనికి వచ్చే ఖజీపేటకు చెందిన అమీర్ అనేవ్యక్తి ఫోను ద్వార మీ ఇంటికి ఉన్న తాళం పగలగొట్టారని ఆమెకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె తన కుమారుడినితో ఖజీపేటకు వెంట పెట్టుకుని వచ్చి తన ఇంటిని పరిశీలించగా ఇంటిలో ఉన్న బీరువను దొంగలు పగలగొట్టి అందులో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, రూ.40 వేల నగదు దొంగలు చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ హరిప్రసాద్ క్లూస్‌టీంతో ఖజీపేటకు వెళ్లి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ హరిప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఏడేళ్ల బాలికపై అత్యాచారం

• యువకుడిపై పోక్సో కేసు నమోదు



కౌతాళం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో గురువారం సాయంత్రం ఏడేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేశాడు. బాలిక ఇంటి దగ్గర ఆడుకుంటుండగా బిస్కట్లు, చాక్లెట్లు ఇస్తానని ఆశచూపి రంగస్వామి అనే యువకుడు తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తల్లి వెతికారు. ఈ సమ యంలో బాలిక యువకుడి ఇంట్లో నుంచి ఏడుస్తూ బయటకు వచ్చింది. తల్లి అడగ్గా బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. మంత్రాలయం సీఐ రామాంజులు ఘటన జరిగిన గ్రామంలో విచారించారు. బాలికను ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సోమ్లానాయక్ తెలిపారు.

హామీల అమలులో బీజేపీ విఫలం

• సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గఫూర్

పాములపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్ళు గడుస్తున్నా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల హామీలను అమలు చేయలేదని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. గురువారం పాములపాడులో పార్టీ సీనియర్ నాయకుడు రామేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీపీఎం కార్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో ఉగ్రవాదులను పూర్తిగా మట్టుబెట్టకుండా ట్రంప్ ఆదేశాల మేరకు కాల్పుల విరమణ చేపట్టారని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, నల్లధనాన్ని విదేశాల నుంచి తెచ్చి పేదలకు పంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చడంలో మోదీ విఫలమయ్యారని అన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించివేస్తున్నదని అన్నారు. పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్, సీనియర్ నాయకులు, ప్రభాకర రెడ్డి, రాజశేఖర్ మాట్లాడుతూ ఒకప్పుడు మోదీని విమర్శించిన చంద్రబాబు నేడు భజన చేస్తున్నారని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, ఏసురత్నం, నాగేంద్రుడు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు చేస్తున్న మేనేజర్ చిన్నరాముడు, చిన్నారులు

కర్నూలు న్యూసిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. గురువారం ఆయన ఖానా ఖజానా వద్ద యోగా ఆసనాల ఉచిత శిక్షణలో పాల్గొని ఆసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా అయుష్ మెడికల్ ఆఫీసర్ డా. శ్రీనివాసరావు, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, శిక్షకులు అక్షర, మునిస్వామి, జిల్లా యోగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సి. బెళగల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత రెండు రోజుల నుంచి నిర్వహించిన యోగా శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ మండలంలోని సిబ్బందికి, హెల్త్ సిబ్బందికి యోగా గురించి యోగా గరువు సోమేశ్వరరెడ్డి శిక్షణ ఇచ్చారన్నారు. అనంతరం ఆయా శాఖల సిబ్బంది కలిసి గ్రామ పంచాయతీలలో ప్రతి గృహాన్ని సందర్శించారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల పరిదిలోని ఉల్చాల గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పరిషత్ ఆవరణలోని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నగేష్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేకసార్లు వినతి పత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు పరిష్కరించడం లేదన్నారు. అనంతరం డీఈ అమల, ఏఈ రంగస్వామి స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేంద్ర, మండల కార్యదర్శి ప్రకాష్, గ్రామ కార్యదర్శి హరికిషన్‌రెడ్డి, నాయకులు అంజి, రాము,రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బి. హైమావతి



నియామక పత్రం అందుకుంటున్న బి. హైమావతి

కర్నూలు అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బి. హైమావతిని నియమించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, కోడుమూరు నియోజ వర్గం ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ ఆమెకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లాజరస్, ఏ లలితమ్మ, రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వల్ల బ్రాహ్మణులకు తీరని అన్యాయం

కర్నూలు అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం బ్రాహ్మణులకు తీరని అన్యాయం చేసిందని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర బ్రాహ్మణుల సాధికారిక కమిటీ రాష్ట్ర నాయకులు ఎస్ వెంకటరామ రాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు జ్వాలాపురం శ్రీకాంత్, బ్రాహ్మణ సాధికార సమితి నాయకుడు కె బుచ్చి రాంప్రసాద్ టీడీపీని విమర్శించే స్థాయి లేదన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం టీడీపీ 2014- 19 అధికారంలో ఉన్నప్పుడు, ప్రస్తుతం కూడా బ్రాహ్మణుల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్న పథకాలను రద్దు చేసి వారి జీవితాలను నాశనం చేసిందని ఆరోపించారు.

స్టాఫ్ నర్స్ మంజులదేవికి సన్మానం



డాక్టరేట్ పొందిన మంజులదేవిని సన్మానిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్, సిబ్బంది

కర్నూలు హస్పిటల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన స్టాఫ్ నర్సు డి.మంజులదేవిని గురువారం కర్నూలు జీజీహెచ్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పి సావిత్రీబాయి, నర్సింగ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్యరంగంలో గత 25 సంవత్సరాలుగా కర్నూలు జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించినందుకు మంజులదేవిని గుర్తించి డాక్టరేట్ ఇచ్చారని హెడ్ నర్సులు కొనియాడారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 జి.విమలమ్మ, హెడ్ నర్సులు పి.లీలారాణి, ఆదిలక్ష్మి, వి.శ్రీదేవి, జే.నిర్మల, రమణమ్మ, బి.సుధారాణి, స్టాఫ్ నర్సులు కళ్యాణి, రాజేశ్వరి, శ్రీదేవి, సుజాత, నాగలక్ష్మిబాయి, ఏపీ హంస సిటీ అధ్యక్షుడు గోవిందుస్వామి పాల్గొన్నారు.

లూజు విత్తనాలపై సమాచారం అందించండి

కోడుమూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలో పత్తి లూజు విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని వ్యవసాయ అధికారి రవిప్రకాష్ అన్నారు. స్థానిక పురుగు మందులు, విత్తన దుకాణాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పకుండా బిల్లులు ఇవ్వాలని అన్నారు. రైతులు అడిగిన విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి. రైతులు అనుకూల పరిస్థితుల్లో మాత్రమే విత్తనాలను విత్తుకోవాలని చెప్పారు.



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రవిప్రకాష్



ఇదీ కాలువ దుస్థితి..

పోలూరు కాలువకు దారేదీ?

- ప్యాలకుర్తి వద్ద పోలూరు కాలువలో కంప చెట్లు
- మండిపడుతున్న రైతులు

కోడుమూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎల్లెల్సీ చనుగొండ్ల దాటాక డివైడర్ డ్యాం నుంచి ప్యాలకుర్తి, అమడగుంట్ల మీదుగా వెళుతుంది. డివైడర్ డ్యాం వద్ద మరో చీలిక కర్నూలు వైపు వెళుతుంది. ప్యాలకుర్తి వైపు వచ్చే కాల్వను పోలూరు కాలువ అని పిలుస్తారు. ఈ కాలువలో పూడిక నిండిపోయింది. జంబు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీని వల్ల కాలువలో నీరు ముందుకు పారడం లేదు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. కాలువను శుభ్రం చేయకపోవడంతో దాని ఆనవాళ్లు కనిపించడం లేదు. చివరికి కాలువ గట్టు మీదుగా ఎద్దులబండ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పంట ఉత్పత్తులను కాలువ గట్టు మీద వాహనాలలో తరలించడానికి వీల్లేకుండాపోయింది. కాలువలో కిలోమీటర్ల మేర పెరిగిన జంబు, కంపచెట్లు పెరగడం వల్ల గతంలో మన్సూర్ పొలం వద్ద సాగునీరు గట్టెక్కి ప్రవహించి సుమారు 50 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. అయినా ఎల్లెల్సీ అధికారుల్లో చలనం కలగలేదని రైతులు మండిపడుతున్నారు. కాల్వ గట్టుపై పెరిగిన కంపను ఇటీవల కొందరు రైతులు సొంత డబ్బు ఖర్చు చేసి తొలగించుకున్నారు. అధికారులు, లస్కర్ల పర్యవేక్షణపై తీవ్ర విమర్శలున్నాయి.



కంపచెట్లతో నిండిపోయిన కాల్వ



కాల్వ నుంచి బయటకు వస్తున్న సాగునీరు (ఫైల్)



పంటకాల్వ దుస్థితి

సొంత డబ్బుతో కంప తొలగించాం



ఎల్లెల్సీ కాలువను అనుకుని నాకు ఎనిమిది ఎకరాలు ఉంది. పొలంలో నిత్యం పనులు ఉంటాయి. ఒక్కోసారి రాత్రి సమయాల్లో పొలానికి వెళ్లాల్సి ఉంటుంది. కాల్వ గట్టు వెంట పెరిగిన కంప ఇబ్బందిగా మారింది. ఇటీవల రూ.5వేలు ఖర్చు చేసి తొలగించుకున్నాం. కాల్వ అధ్వానంగా తయారైంది.

- ఖాజాహుసేన్, రైతు ప్యాలకుర్తి

సాగునీరు గట్టెక్కడంతో పంట మునిగింది



కాల్వ నిండా జంబు, కంపచెట్లు పెరిగిపోవడంతో నీరు ముందుకు సాఫీగా ప్రవహించడం లేదు. గతంలో సాగునీరు గట్టెక్కి ప్రవహించడంతో సుమారు 50 ఎకరాలకుపైగా పైరు మునిగి రైతులకు నష్టం వాటిల్లింది. అప్పుడు మేం కూడా నష్టపోయాం. అయినా కాల్వలో పూడిక తీయలేదు. కంప తొలగించలేదు. అధికారులు చర్యలు చేపట్టాలి.

- దానం, రైతు, ప్యాలకుర్తి

మత సామరస్యాన్ని కాపాడుకుందాం

కర్నూలు న్యూసిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని తరిమేసి, మతసామరస్యాన్ని కాపాడుకుందాని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పరిషత్ నుంచి పాతబస్టాండు వరకు సమైక్య యాత్ర నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ కూడలిలో పాతబస్తీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడుల తరువాత మతోన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా నరేంద్ర మోదీ ఆయన అనుచరగణం ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల కాలంలో ముస్లింలపై 100కు పైగా దాడులు జరిగాయన్నారు. ఉగ్రవాదులు పహల్గాంలోకి ఎలావచ్చారో బీజేపీ ప్రభుత్వం బయటపెట్టలేదన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎప్పుడు ఏమి మాట్లాడతాడో అతనికి అర్థం కావడం లేదన్నారు. సనాతన ధర్మం పేరుతో మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను అశాంతికి గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, న్యూసిటి కార్యదర్శి టి.రాముడు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పీఎస్.రాధాక్రిష్ణ, కేవి.నారాయణ, ఎండి.ఆనంద్ బాబు, అలివేలమ్మ, గురుశేఖర్. ఎం.విజయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

యువత వ్యసనాలకు దూరంగా ఉండండి

- సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్

కర్నూలు స్పోర్ట్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా, దూరంగా ఉండాలని సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. గురువారం జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో బనవాసి ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో డ్రగ్స్ దుర్వినియోగం, యోగాంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యోగా చేయడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని కలిగిస్తుందని, ప్రతి రోజు విద్యార్థులు యోగా చేయాలని తెలిపారు. కళాశాల ప్రధానోపాధ్యాయుడు ఇతర ఉపాధ్యాయులకు యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించి విద్యార్థులందరూ జూన్ 21న జరిగే యోగాంధ్ర ఈవెంట్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.సోమశివారెడ్డి, సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, ప్రిన్సిపాల్ గురు విష్ణు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో కే. వేణుగోపాల్

మహానాడుకు బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు

ఓర్వకల్లు, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు సభకు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బయలుదేరి వెళ్లారు. గురువారం మూడో రోజు మహానాడు ముగుస్తుండగా 25 బస్సులు, ప్రత్యేక వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు వెళ్లారు. వెళ్లిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, విశేశ్వరరెడ్డి నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏసేపు, అల్లాబాబు, యాసీన్‌బాషా, శ్రీరామిరెడ్డి, మౌళీశ్వరరెడ్డి, కాకి దేవేంద్ర, సుధాకర్‌రావు ఉన్నారు.



ఓర్వకల్లు నుంచి తరలివెళ్తున్న నాయకులు

కర్నూలు రూరల్: కడపలో జరిగిన మహానాడులో కోడుమూరు నియోజకవర్గం సంబంధించిన టీడీపీ మండల కన్వీనర్లు హాజరయ్యారు. ఆపార్టీ కర్నూలు మండల కన్వీనర్ బోయ బుర్ర వెంకటేశ్వర్లు, బెళగల్ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ బోయ చంద్రశేఖర్, గూడూరు మండల కన్వీనర్ సురేష్, కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు కోడుమూరు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు బోయ కృష్ణ, గోరంట్ల సర్పంచు సద్దల బాలకృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు చందు, టీడీపీ మండల యువ నాయకులు ఆర్. కొంతలపాడు బోయ గిరి మోహన్, పూడిచెర్ల రమేష్ పాల్గొన్నారు.



మహానాడులో పాల్గొన్న మండల కన్వీనర్లు

కర్నూలు అర్బన్: కడప మహానాడుకు వంద బస్సులు, వంద చిన్నవాహనాలను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పరిశీలకులు కొంకతి లక్ష్మీనారాయణ బస్సులను ప్రారంభించారు. గురువారం అనంతపురం నగరంలోని శివకోటి ఆలయం వద్ద కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లిన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కడపలో 7 లక్షల మందితో మహానాడు నిర్వహించి చరిత్ర సృష్టించామని అన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే, పరిశీలకుడు

గూడూరులో కార్మికుల నిరసన

గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): తమ సమస్య పరిష్కరించేత వరకు నిరసన కొనసాగుతుందని నగర పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. గురువారం గూడూరులోని పాత బస్టాండ్ ప్రాంతంలో నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె లో భాగంగా ఒంటి కాలుపై నిలబడి నిరసన కార్యక్రమం చేపట్టారు. నగర పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ కార్మికులు 22 రోజులుగా వివిధ రకాలుగా నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు ఆరవింద్, దూకేశ్వర రావు, బసవరాజు, మధు, అంజనేయులు, అల్లిబాష, షబ్బీర్, జయన్న, హుసేన్ ఖాన్, ఖాజాహుసేన్, ప్రభాకర్, హరిబాబు పాల్గొన్నారు.

గర్భిణులు రూబెల్లాపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు హస్పిటల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గర్భంలో ఉన్న మహిళకు రూబెల్లా సోకితే ఇది పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డా.రఘు హెచ్చరించారు. గురువారం ఉలిందకొండ పీహెచ్‌సీ పరిధిలోని పెద్దటేకూరు గ్రామంలోని సచివాలయంలో తల్లులు, గర్భవతులకు తట్టు, రూబెల్లా, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. తట్టు ఒక ప్రాణాంతక వ్యాధి అని, దీని కారణంగా చిన్నారుల్లో న్యూమోనియా, వీరేచనాలు, మెదడువాపు వ్యాధులకు గురవుతారన్నారు. మిజిల్స్ రూబెల్లా వ్యాధులు రాకుండా ఉండాలంటే 9నుంచి 12నెలల వయసులో చిన్నారులు మొదటి డోసు, 16 నుంచి 24 నెలల వయస్సులో ఉన్న వారికి రెండో డోసు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం సువర్ణ, ఆశ కార్యకర్తలు, ప్రొజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రూపాల సంగమేశ్వరాలయంలో కలెక్టర్ పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న కలెక్టర్

కర్నూలు కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): జగన్నాథగట్టుపై వెలసిన ఉమాసమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం కలెక్టర్ పి. రంజిత్‌బాషా దర్శించారు. ఆయన వెంట కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, కర్నూలు, కల్లూరు తహసీల్దార్లు వెంకటరమేశ్, కె. అంజనేయులు, దిన్నెదేవరపాడు వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు. కలెక్టర్‌కు ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్ స్వామి ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్‌తో స్వామివారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శాలువతో సత్కరించారు. రూపాల సంగమేశ్వర ఆలయ ఉద్యోగి సుబ్బారెడ్డి సంగమేశ్వర స్వామి ఆలయ విశేషాలను కలెక్టర్‌కు వివరించారు.

ప్రతి కార్డుదారుడికి రేషన్ సక్రమంగా అందజేయాలి



చౌక దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

సి. బెళగల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్డుదాడికి బియ్యం సక్రమంగా అందజేయాలని తహసీల్దార్ పురుషోత్తం డీలర్లకు సూచించారు. గురువారం మండలంలోని ఇనగండ్ల, కొండాపురం, గుండ్రేవుల గ్రామాలలోని చౌకదుకాణాలను తనిఖీచేశారు. తహసీల్దార్ పురుషోత్తం మాట్లాడుతూ కూ టమి ప్రభుత్వం డీలర్లపై నమ్మకంతో మరల చౌకదుకాణాలను అప్పగించడం జరిగింది. డీలర్లకు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ తరుణ్, వీఆర్వోలు డీలర్లు ఉన్నారు.

నలుగురికి రిమాండ్

సి. బెళగల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో రెండు నెలల కిందట ఓవివాహంలో జరిగిన ఘర్షణ కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ సోమనాయుడు, శివ, వడ్డెమేకల రాముడు, సోద రాముడు అనారోగ్యం కారణాలతో రిమాండ్‌కు తరలించలేదని, ప్రస్తుతం వారి ఆరోగ్యం బాగా ఉండడం వల్ల కోర్టు ఆదేశాల మేరకు గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గృహ నిర్మాణాలపై నిర్లక్ష్యం వద్దు

సి. బెళగల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి రంగనాథబాబు సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాలను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన ఇళ్లకు నిధులు కూడా మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఏఈ సుమంత్ వెంట వర్కు ఇన్‌స్పెక్టర్ రంగన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

మేయర్‌ను కలిసిన డిప్యూటీ కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): నగర మేయర్ బీవై.రామయ్యను నగర పాలక డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల నగర పాలక డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సతీష్‌రెడ్డి గురువారం మేయర్‌ను క్యాంప్ ఆఫీసులో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ మేరకు నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి మేయర్‌ను అడిగి తెలుసుకున్నారు.



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీ సతీష్‌రెడ్డి

భజన కళాకారుడు ఎల్లాగౌడ్ కన్నుమూత

కర్నూలు కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన ప్రముఖ భజన కళాకారుడు, రంగస్థల నటుడు ఎల్లాగౌడ్ (83) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఎల్లాగౌడ్ హార్మోనిస్టుగా అనేక నాటక సమాజాల వద్ద పని చేశారు. అలాగే భజన పోటీల్లో తనదైన ప్రతిభతో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వందకు పైగా భజన పోటీల్లో ఉత్తమ భజన కళాకారునిగా, గాయకుడిగా బహుమతులు అందుకున్నారు. అలాగే శ్రీకృష్ణ రాయబారం నాటకంలో కర్ణుని పాత్ర పోషించి ఆ పాత్రకు వన్నె తీసుకువచ్చారు. మంచి గాత్ర కళాకారునిగా ఉన్న ఎల్లాగౌడ్ రాష్ట్ర స్థాయిలో చిన్నటేకూరు గ్రామానికి పేరు తీసుకువచ్చారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల ప్రముఖ హార్మోనిస్టు ఎర్రమ పాండురంగయ్య తన సంతాపం వ్యక్తం చేశారు. గొప్ప భజన కళాకారున్ని జిల్లా కోల్పోయిందని, ఎల్లాగౌడ్ లేని లోటు ఎవరూ తీర్చలేనిదని కొనియాడారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జిల్లాలోని పలువురు భజన కళాకారులు ఎల్లాగౌడ్ మృతికి తమ సంతాపం తెలిపారు.



భజన కళాకారుడు ఎల్లాగౌడ్ (ఫైల్)

రేపు పింఛన్ల పంపిణీ

ఆదోని టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ గురువారం తెలిపారు. జూన్ 1 ఆదివారం కావడంతో ముందుగానే ఇస్తామన్నారు. పింఛన్‌దారులు గృహాల వద్దే ఉండాలని సూచించారు.

విక్రయాలను నమోదు చేయాలి

హొళగుంద, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు విక్రయించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలను రికార్డులలో నమోదు చేయాలని ఏవో ఆనంద్ లోకదాల్ తెలిపారు. గురువారం హొళగుంద లోని దుకాణాలను తనిఖీ చేశామ న్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ఏఈవో విరుపాక్షి, ఎంపీఈవో నరసింహ పాల్గొన్నారు.


స్టాకును పరిశీలిస్తున్న ఏవో

పేద విద్యార్థిని చదువుకు చేయూత


ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఆదోని, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ జీరో రోడ్డులో నివాసముంటున్న సిద్ధప్ప, లక్ష్మి దంపతుల పెద్ద కూతురు ఉప్పరి హర్షిత పదో తరగతిలో 511 మార్కులు సాధించింది. ఇకపై చదివించేందుకు తమకు స్థోమత లేదని ఆపేద్దామని కుటుంబ సభ్యులు అనుకున్నారు. విషయం తెలుసుకున్న సహృదయ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఎస్‌కేడీ రూ.21వేలు చెల్లించారు. రెండో ఏడాది కూడా ఫీజు తామే భరిస్తామని, మంచిగా చదివి ఉద్యోగం సంపాదించాలని ఆకాంక్షించారు. సభ్యులు గిరి, రఘు, పెద్దయ్య భగవాన్ స్వాతి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి


మాట్లాడుతున్న కాలనీవాసులు

ఆదోని రూరల్, మే 29 ఆంధ్రజ్యోతి): తమ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పట్టణంలోని సాయినగర్‌కాలనీ వాసులు కోరారు. గురువారం సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. వీధిలైట్లు, డ్రైనేజీ రోడ్లు, తాగునీరు లేవని అధికారులు స్పందించాలన్నారు.

రాయితీ విత్తనాలు మంజూరు

● ఏడీఏ బాలవర్ధిని రాజు



ఆదోని అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాలకు ఖరీఫ్‌కు రాయితీ విత్తనాలు మంజూర య్యాయని ఏడీఏ బాలవర్ధిని రాజు తెలిపారు. గురువారం మాట్లాడుతూ ఆదోని మండలానికి 2,814 క్వింటాళ్ల వేరుశనగ గాను మొదటి విడతగా 780 క్వింటాళ్లు, కోసిగికి 626 క్వింటాళ్లకు గాను 120 క్వింటాళ్లు, కౌతాళం మండలానికి 232 క్వింటాళ్లకు గాను 32 క్వింటాళ్లు, పెద్దకడబూరుకు 868 క్వింటాళ్లకు గాను 150 క్వింటాళ్లు మంజూరు చేశారన్నారు. అర ఎకరాకు బస్తా, ఎకరాకు 2, ఆపై భూమి కలిగిన రైతులకు మూడు బస్తాలు రాయితీ వేరుశనగ అందిస్తామన్నారు. క్వింటాలు కే6 రకం వేరుశనగ ధర రూ.9,300లు కాగా, 40 శాతం రాయితీ రూ.3720 పోగా, రైతు లు రూ.5,520 కట్టాలన్నారు. సమీప రైతు భరోసా కేంద్రాలలో రైతులు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

మహానాడుకు తెలుగు తమ్ముళ్లు

ఆదోని, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడు ముగింపు రోజు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదోని నుంచి టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, ఉమాపతి నాయుడు ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు బయలుదేరి వెళ్లారు. 35 బస్సు లు 60 వాహనాల్లో 3వేల మందికిపైగా తరలివెళ్లారు.

పారిశుధ్య పనులు చేయించండి

హొళగుంద, మే 29 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో పారిశుధ్య పనులు చేయించాలని ముద్దటామాగి గ్రామస్థులు కోరారు. గురువారం మాట్లాడుతూ రోడ్డుపై మురుగు పేరుకుపోయి, దోమల వ్యాప్తి పెరిగిందని, చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా రోగాలబారిన పడుతున్నామని వాపోయారు. బీరప్ప ఆలయం వెనక కాలనీలో రోడ్డుపై మురుగు చేరి దుర్వాసన వస్తోందన్నారు. అధికా రులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై ఈవోఆర్‌డీ చక్రవర్తిని వివరణ కోరగా తర్వలోనే పారిశుధ్య పనులు చేయిస్తామని తెలిపారు.


మురుగును చూపుతున్న గ్రామసులు

మహాసభలను జయప్రదం చేయాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ

ఆదోని అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట ప్రభుత్వ ఉద్యోగుల మహాసభలు జూన్ 5న విజయవాడలో నిర్వహిస్తున్నట్లు జయప్రదం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆదోని అధ్యక్షుడు ఎస్‌ఏ రషీద్ కోరారు. గురువారం ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ చేతుల మీదుగా గోడపత్రికను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ ఏర్పాటులో జాప్యం చేస్తోందని ఆరోపించారు. జీపీఎస్, పీఆర్‌సీ, ఆర్థిక బాకయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామన్నారు. ఉద్యోగులంతా భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ట్రెజరర్ లక్ష్మీ నాగ రవి, ఉపాధ్యాక్షుడు చంద్రకాంత్, సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, దేవోజీ, రాజశేఖర్, వేణు పాల్గొన్నారు.

జలకళ


నీటితో కళకళలాడుతున్న జొన్నగిరి చెరువు


నిండుగా దర్శనమిస్తున్న రాతన చెరువు

పత్తికొండ, మే 29 (ఆంధ్రజ్యోతి):నిన్న, మొన్నటివరకు ఎండిపోయిన చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తికొండ, రాతన, జొన్నగిరి చెరువులు నీటితో నిండాయి. కాగా హంద్రీనీవా వేసవికి ముందే ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నాయకత్వంలో నీరు నింపారు. అయితే వేసవిలో నీరు ఇంకిపోగా, తిరిగి వర్షాలు కురవడంతో నీరు చేరింది.

బస్టాండ్ పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం ఆర్టీసీ బస్టాండును ఆయన పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శుభ్రంగా ఉంచాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఆవరణలో ప్రైవేటు వాహనాల పార్కింగ్‌ను గమనించి, వాటికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బస్సుల సమయపాలన, సదుపాయాల గురించి ప్రయాణికులను అడిగారు. బస్సులు లోపలకు వచ్చే, బయటకు వెళ్లే ప్రాంతంలో రహదారిని సరిచేయించాలని ఆదేశించారు.

గుంతల దారి


ములుగుందం గ్రామంలో నీటి కుంటలా మారిన రోడ్డు

ఆస్పరి, మే29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుందం గ్రామంలోని ఆదోని-తెర్నెకల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షాలకే నీటికుంటలను తలపిస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనదారులు ప్రమాదాలకు లోనయ్యే అవకాశం ఉంది.

ఎన్నికల హామీలను అమలు చేయాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం వద్ద చేయనున్న ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. పేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున స్థలం ఇవ్వాలని, గృహనిర్మాణానికి రూ.5లక్షలు నిధులు మంజూరు చేయాలని, వంక, వాగు, చెరువు, అసైన్డ్, ఆలయ, ఈనాం భూములు శ్మశానాలను కూడా కొందరు ఆక్రమించారని, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజాసాహెబ్, రామాంజనేయులు, గురుదాస్, కారన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై వర్షపు నీరు



దేవనకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేముల -తెర్నేకల్ ప్రధాన రహదారి మధ్యలో వర్షపునీరు నిలిచింది. రోడ్డు మధ్యలో గుంతలు ఉన్నాయని అధికారులు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

వజ్రాన్వేషకులు రాకుండా చూడండి

● ఎస్‌ఐకి రైతులు, నాయకుల వినతి

తుగ్గలి, మే 29 (ఆంధ్రజ్యోతి): వజ్రాన్వేషకులు వచ్చి తమ పొలాలను పాడు చేస్తున్నారని, వారిని రాకుండా చేయాలని సర్పంచ్ ఓబులేసు, సలహాదారుడు లక్ష్మణస్వామి యాదవ్, రైతులు కోరారు. గురువారం జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. వజ్రాన్వేషకులు పొలాల్లో తిరగకూడదని హెచ్చరిక బోర్డులు పెట్టినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎస్‌ఐ ఇప్పటికే స్థానికేతులను వెళ్లిపొమ్మన్నామని, ఇంకా ఎవరైనా ఉంటే వారిని కూడా ఇక్కడి నుంచి పంపిస్తామని చెప్పారు.

మహానాడుకు తరలిన నాయకులు

ఆలూరు, మే29(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సూచనల మేరకు ఆలూరు నుంచి యువనాయకుడు గిరి మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు కడపకు తరలివెళ్లారు. ఆరు మండలాల నుంచి వాహనాల్లో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, తరలివెళ్లారు.

హాలహర్వి: మహానాడులో పాల్గొనేందుకు మండల టీడీపీ నాయకులు గురువారం తరలివెళ్లారు. పార్టీ నాయకుడు తిప్పేస్వామి, సర్పంచ్ మల్లికార్జున, జె.హొసళ్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు కురుమల్లన్న ఆధ్వర్యంలో బయలుదేరారు.

కూలీల సంఖ్య పెంచకపోతే చర్యలు

హాలహర్వి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల పెంచకపోతే చర్యలు తప్పవని ఏపీడీ ఫక్కీరప్ప హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కూలీల సంఖ్యలో హాలహర్వి మండలం వెనకబడి ఉందని, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. జూన్ పూర్తయ్యేలోపు ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని సూచించారు. ఎంపీడీవో వరలక్ష్మి ఏపీఓ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీడీ ఫక్కీరప్ప

తెలుగు దేశంతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మాట్లాడుతూ మహానాడు దిగ్విజయంగా పూర్తయిందని, లక్షల మంది కార్యకర్తలు పాల్గొని విజయవంతం ఎమ్మెల్యేగా శ్యాంబాబు ఆధ్వర్యంలో మండలంలో దాదాపు రూ.5 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురవడంతో ప్రభుత్వం రాయతీ విత్తనాలను సరఫరా చేసిందని, ఇది రైతుల ప్రభుత్వం అని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని స్థానిక రంగమ్మ కుంటకు మరమ్మతులు చేయిస్తున్నారని గుర్తు చేశారు.

టీడీపీ నాయకుడి మృతి

హొళగుంద, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వందవాగాలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురువ చంద్రశేఖర్(53) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేశారు. కురువ శేషన్న, నాగప్ప, రాజగోపాల్ సంతాపం తెలిపారు.


చంద్ర శేఖర్(ఫైల్)

యోగాభ్యాసం చేయాలి

మద్దికెర, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాభ్యాసం చేయాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సూచించారు. గురువారం డీపీఏపీ కమ్యూనిటీ హాలులో యోగా శిక్షణ ఇచ్చారు. కార్యదర్శులు పరమేశ్వరప్ప, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

1న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): జూన్ 1న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ చేయనున్నట్లు ఆవోపా అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. గురువారం మాట్లాడుతూ పట్టణంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేస్తామన్నారు. 6 నెలల నుంచి 16 సంవత్సరాల్లోపు చిన్నారులను తీసుకురావాలని తల్లిదండ్రులను కోరారు.

హామీలు అమలు చేయాలి

మద్దికెర, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, కన్వీనర్ మల్లికార్జున యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏడాదవుతున్నా, ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. మాజీ ఉప సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ చిరంజీవి


నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

పత్తికొండ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి లబ్ధిదారులకు సూచించారు. గురువారం పత్తికొండ- ఆదోని రహదారిలో గత ప్రభు త్వంలో ఏర్పాటైన కాలనీలను పరిశీలించారు. గత ప్రభుత్వంలో నిరుపేదలకు స్థలాలతో పాటు గృహ నిర్మాణానికి నిధులు ఇచ్చా రని, చాలామంది లబ్దిదారులు పూరిచేయ లేదన్నారు. జూన్ 12 లోపు పూర్తి చేస్తే ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇస్తామని తెలిపారు. హౌసింగ్ డీఈ విజయకుమార్, ఎంపీడీవో కవిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ అలి పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సిద్ధం

మద్దికెర, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంపిణీ చేసేందుకు మండలానికి 40 రాయితీతో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో రవి తెలిపారు. గురువారం మాట్లాడుతూ మండలానికి 580 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాని, రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంచామన్నారు. క్వింటం ధర రూ.9,300లు కాగా, 40 శాతం రాయితీ 3,720 పోగా, రైతులు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆధార్, పొలం పాసు పుస్తకం, సెల్‌ఫోన్ తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఐదెకరాలల్లోపు ఉన్న రైతులకు 90 కిలోలు ఇస్తామన్నారు.

యోగా చేయాలి

ఆదోని రూరల్, మే 29 ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాను తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జనార్ధన్ తెలిపారు. గురువారం ఉదయం, సాయంత్రం సచివాలయ, పంచాయతీ సిబ్బంది యోగాలో పాల్గొన్నారు. ట్రైనర్ నివేదిత యోగా సనాలు వేసి వారికి ట్రైనింగ్ ఇచ్చారు.

జయప్రదం చేయండి

వెల్దుర్తి, మే 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో చేయనున్న ఆందోళనను జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం వెల్దుర్తి ఏఐటీయూసీ కార్యాలయంలో గోడ పత్రికలు విడుదల చేశారు. ఏసన్న, మాధవస్వామి, రాజు, వెంకటేశ్వర్లు, చిన్నమాదులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో నాయకుల సందడి


నాయకులతో వైకుంతం శివప్రసాద్, జ్యోతి

మహానాడు మూడోరోజు గురువారం ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల నాయకులు సందడి చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను కలిసి, తమ నియోజకవర్గాల పరిస్థితులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ, నాయకులను కలిశారు. - ఆలూరు, తుగ్గలి


ఎంపీ నాగరాజుతో తుగ్గలి నాయకులు


ఎమ్మెల్యే శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర

అనుమతి లేని లే అవుట్లపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● తహసీల్దార్ చంద్రశేఖరవర్మ



వెల్దుర్తి, మే 29(ఆంధ్రజ్యోతి): అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర వర్మ హెచ్చరించారు.

ప్రశ్న: అక్రమ లే అవుట్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: వెంచర్లు వేసేవారు భూమి విలువలో 5 శాతం చెల్లించి వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకోవాలి. ఇప్పటికే అక్రమ లే అవుట్లు వేసినవారు 10 శాతం అపరాధ రుసుముతో అనుమతి పొందాలి. అలా చేయనివారికి నోటీసులు ఇస్తాం, స్పందించకుంటే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నూతన రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల పేర్ల మార్పుకు ఎలా దరఖాసు చేయాలి?

జవాబు: కొత్తగా పెళ్లైన జంటలు, రేషన్‌కార్డు లేనివారు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, ఆశ్రమాల్లో ఉండేవారు దగ్గరల్లోని సచివాలయంలో దరఖాస్తు చేయాలి. కుటుంబసభ్యుల విభజన, చేర్పు, చిరునామా మార్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపుకు అవకాశం ఉంది. జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో నూతన కార్డులు మంజూరు అవుతాయి.

ప్రశ్న: ఈ కేవైసీ ఎలా?

జవాబు: 0-5 ఏళ్లలోపు పిల్లలు, వృద్ధులు, కార్డులో పేరుండి బియ్యం రాని వారు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలి. వీఆర్వోలు, డీలర్లు, సచివాలయాల్లో సంప్రదించాలి.

ప్రశ్న: ప్రభుత్వ భూమూలను కొందరు ఆక్రమించినట్లు ఆరోపణలు వస్తున్నాయి?

జవాబు: లిఖితపూ ర్వకంగా ఫిర్యాదుచేస్తే రికార్డులు పరిశీలించి భూమిని స్వాధీనం చేసుకుంటాం.

ప్రశ్న: భూ సమస్యలు పరిష్కరిస్తున్నారా?

జవాబు: భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రీసర్వే చేస్తున్నాం. రైతులకు ఒకరోజు ముందుగా సమాచారం ఇచ్చి సర్వే చేస్తున్నాం.

ప్రశ: రెవెన్యూ అధికారుల పనితీరు ఎలా ఉంది?

జవాబు: రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించాం. పనిచేయని వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: జూన్ నుంచి రేషన్ ఎక్కడ తీసుకోవాలి?

జవాబు: జూన్ నుంచి చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ చేస్తాం. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు డీలర్ ఇంటి వద్దకే హోమ్ డెలివరీ చేస్తారు.

ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలు



మున్సిపల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఇంజనీరింగ్ వర్కర్స్

ఎమ్మిగనూరు టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా ఇంజనీరింగ్ సెక్షన్‌లో వివిధ భాగాల్లో పని చేస్తూ చాలీచాలని జీతాలతో, పెరిగిన ధరలతో జీవిస్తున్నామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ అన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు గురువారం 23వ రోజు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ నుండి వైఎస్ఆర్ సర్కిల్ అక్కడ నుండి మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సరుకులు అందించాలి

పెద్దకడబూరు , మే 29(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు పారదర్శకంగా సరుకులు అందించాలని తహసీల్దార్ గీతాప్రియదర్శిని అన్నారు. గురువారం మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో జూన్ 1న రేషన్ దుకాణం వద్ద సరుకులు తీసుకునేందుకు ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు రేషన్ దుకాణం దగ్గరకు వెళ్లి సరుకులు తీసుకోవాలన్నారు. డీలర్లు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి దగ్గరకు వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రీసర్వే గురించి సర్వేయర్లను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జర్మియా, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గీతా ప్రియదర్శిని

జోసెఫ్ మరణం తీరని లోటు



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రాలయం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌలహల్లి గ్రామానికి చెందిన జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి జోసెఫ్ (37) గుండెపోటుతో మృతి చెందాడు. జోసెఫ్ మరణం సంఘానికి తీరని లోటు అని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జిల్లా కార్యదర్శి రత్నం, మంత్రాలయం మండల అధ్యక్షులు నరసింహులు అన్నారు. గురువారం జోసెఫ్ మృతదేహానికి నివాళులర్పించారు. దళిత గిరిజనుల కోసం ఎప్పుడూ పోరాటాలకు కృషి చేసేవారని కొనియాడారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా జైభీమ్ ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందన్నారు. అతి చిన్న వయసులో గుండెపోటుతో జోసెఫ్ మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో నాయకులు ఇజ్రాయేల్, ప్రభాకర్, హుశేన్, జోజప్ప, దేవదాసు, నగేష్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



గోనెగండ్లలో ధ్యానం చేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

గోనెగండ్ల, మే 29(ఆంధ్రజ్యోతి): యోగాతోనే ప్రతిఒక్కరి మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్డీ అనంతశయన అన్నారు. గురువారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మూడో రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలయందు ఉద్యోగులు, అధికారులు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మణిమంజరి మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 21 వరకు ఏపీని యోగాంధ్రగా గుర్తించిందని అందుకు గాను ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. యోగా, ధ్యానం ద్వార కలిగే లాభాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో పలు గ్రామాల కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

భార్య, అత్తమామలపై దాడి

● ఇద్దరికి గాయాలు..

మంత్రాలయం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి తన భార్య లక్ష్మి, అత్త బోయ గోవిందమ్మ, మామ నరసింహులుపై కట్టెతో దాడిచేసి గాయపరిచారు. ఈ దాడిలో భార్య, అత్తకు తీవ్ర గాయాలయ్యాయి. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. నందవరం మండలం ఇబ్రహీంపురం నరసింహులు, గోవిందమ్మ కూతురు కుండ లక్ష్మిని చిలకలడోన గ్రామానికి చెందిన బోయ నారాయణకు ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నాలుగేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా లక్ష్మి పుట్టినిల్లు అయిన ఇబ్రహీంపురంలో ఉంటున్నది. తన భాగానికి వచ్చిన ఎకర పొలంలో గురు వారం పొలాన్ని దున్నేందుకు వెళ్లారు. దీన్ని జీర్ణించుకోలేక భర్త నారాయణ కట్టెతో భార్యను, అడ్డువచ్చిన అత్త గోవిందమ్మను దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

కోసిగి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగికి చెందిన పూజ, కోడి అభిరామ్ అను 5వ తరగతి విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు హేమశ్రీ ట్యూషన్ ట్యూటర్ రాజేష్ తెలిపారు. మోడల్ స్కూల్‌కు చెందిన వినయ్ అను విద్యార్థి ఏపీఆర్‌జేసీకి ఎంపికయ్యాడు. కోసిగి నుంచి ఇద్దరు విద్యార్థులు గురుకులాలకు, ఒకరు ఏపీఆర్‌జేసీకి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

- సమస్యలు ఉంటే తెలియజేయండి
- రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేస్తాయి
- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైతులతో సమీక్ష



దుద్ది గ్రామ పొలాల్లో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్ది గ్రామం రీసర్వేలో పైలట్ ప్రాజెక్టుగా ఎన్నికైనందున రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. గురువారం ఆయన దుద్ది గ్రామ పొలాల్లో రీసర్వే పనులను తనిఖీ చేశారు. రైతులు, సర్వేయర్లను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో సమస్యలు ఏమైనా ఉంటే తమదృష్టికి తీసుకురావాలని రెవెన్యూ పరిధిలో ఉంటే ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం దుద్ది గ్రామ సచివాలయంలో తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. దుద్ది గ్రామ సచివాలయ పరిధిలోని రైతుల వివరాలను సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. ఐరంగల్ గ్రామ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూసేకరణ నిమిత్తం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌర్యభరద్వాజ్ మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేస్తాయని అన్నారు. రైతులందరూ సహకరించి భూసేకరణ సవ్యంగా జరిగేలా చూడాలన్నారు. ఇప్పటికే ఐరంగల్ గ్రామ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నా యని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రుద్రగౌడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, సర్పంచ్ రామాంజనేయులు, సర్వేయర్లు శ్రీనివాసులు, వీఆర్వోలు యేసుదాసు, శ్రీనివాసులు, బసవరాజు, రైతులు తదితరులు ఉన్నారు.

కౌన్సిల్లో ఆమోదించిన తీర్మానాన్ని రద్దు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): హి ందూ శ్మశాన వాటిక భూమి మీదుగా 30 అడుగుల రోడ్డు కోసం మునిసిపల్ కౌన్సిల్‌లో అమోదించిన తీర్మానం నెంబర్ 485ని రద్దుచేయాలని హిందూ శ్మశాన కమిటీ డిమాండ్ చేసింది. గురువారం పట్టణం నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రోడ్డుకిరువైపులా గల హిందూ శ్మశాన వాటిక భూమితో సంబంధం కలిగిన 22 కుల సంఘాలు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యాదవ సంఘంలో నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హిందూ శ్మశాన కమిటీ సభ్యుడు గణేష్, బీరప్ప, పాండురంగస్వామి, దస్తగిరి మాట్లాడుతూ సర్వే నెంబర్ 183-బి మీదుగా 2023మార్చి31 తేదిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో శ్మశాన వాటికలో 30అడుగుల రోడ్డును 17వ వార్డు ప్రజల సౌకర్యార్థంగా ఏర్పాటు చేయడానికి అమోదించిన తీర్మానాన్ని మే30న జరగబోయే సమావేశంలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని రద్దు చేయని పక్షంలో శ్మశాన వాటిక కులాల సంఘాల ప్రతినిధులు, జనసమూహంతో దశలవారీగా ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పుండకుర రంగన్న, కుమ్మరి వెంకటేష్, యాపిలయ్య, భీమన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాండురంగ స్వామి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి

గోనెగండ్ల మే 29(ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు విత్తే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడి పెట్టుబడులు త గ్గించుకోవాలని కోరారు. పంటలకు ఎంతమోతాదులో ఎరువులు వాడాలో తెలుసుకోవాలన్నారు. ఇష్టం వచ్చినట్లు రసాయన ఎరువులు వాడితే పంట దిగుబడి తగ్గి రైతుకు నష్టం వస్తుందన్నారు. ఖర్చులు అదుపులో పెట్టుకుంటే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. పంటల్లో ఎదురయ్యే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవసరం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సాయి హెల్త్ కార్డులు, సీసీఆర్‌సీ కార్డులు రైతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, డీఆర్‌సీ ఏడీఏ గిరీష్, డీఆర్‌సీ ఏవో శశిధర్, బనవాసి కోఆర్డినేటర్ రాఘవేంద్ర, గోనెగండ్ల మేజర్ సర్పంచ్ హైమావతి, రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

నందవరం, మే29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకులు పంపన్న గౌడ్, మండల నాయకులు గిడ్డయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రమైన నందవరంలో జూన్ 2వ తేదిన చేపట్టనున్న ధర్నా పోస్టర్లను విడుదల చేశారు.వారు మాట్లాడుతూ 40 ఏళ్లగా ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదన్నారు. జనాభా పెరుగుదల దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవరాజు, మల్లేష్, నబిసాబ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర పథకాలపై రైతులకు అవగాహన

పెద్దకడబూరు , మే 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరు, తారాపురం గ్రామాల్లో డీపీడీ ఆత్మా, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త అశోక్ కూమార్, శ్రీలత గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగులో పాటించాల్సిన సాగు పద్ధతులపై, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మట్టి పరీక్షల ఆధారంగా పంటలు ఎంపిక చేసుకోవాలన్నారు. మిరప, కంది, పత్తిలో చేపట్టే సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో నంద్యాల కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు చందన, మౌనిక, తేజ, ఏవో వరప్రసాద్, వీపీవోలు జబీ ఉల్లా, శ్వేత, ఇందు పాల్గొన్నారు.

● మండలానికి 230 క్వింటాళ్ల వేరుశనగ పెద్దకడబూరు మండలానికి 230 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించారని ఏవో వరప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో ఆయన మాట్లాడుతూ వేరుశనగా క్వింటాల్ ధర రూ.9300 కాగా రాయితీ రూ 3720 పోను రైతు రూ.5580 కట్టాల్సి ఉంటుందన్నారు. కందులు 50 క్వింటాళ్లు, కొర్రలు 2 క్వింటాళ్లు, జీలుగు 12 క్వింటాళ్లు , పిల్లిపెసర ఒక క్వింటం కేటాయించారన్నారు.

మహానాడులో తెలుగు తమ్ముళ్లు

ఎమ్మిగనూరు , మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపి మహనాడు బహిరంగ సభకు ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం దగ్గర ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆరు బస్సుల్లో ఎమ్మిగనూరు పట్టణం, మండలం, నందవరం, గోనేగండ్ల మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఇప్పటికే నియోజవర్గం నుంచి నాయకులు 1200 మందికి పైగా వెళ్లారు.

మంత్రాలయం: కడపలో జరుగుతున్న మహానాడుకు మంత్రాలయం నియోజకవర్గం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివచ్చారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సీఎం చంద్రబాబు నాయుడుకు శాలువాతో సత్కరించి, రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలాల నుంచి వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



మహానాడుకు తరలివెళ్తున్న నాయకులు



మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు



గజవాహనంపై బంగారు అంబారిలో ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖపుణ్యక్షేత్ర మైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. గురువారం రాఘవేంద్రస్వామికి ఇష్టమైన దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహాలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలు, హోటల్‌లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

వెండి గజవాహనంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై బంగారు అంబారిలో విహరించారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన జ్యేష్ఠ తదియ గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛ రణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి అర్చకుల మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు.

శ్రీ మఠం అన్నదానానికి రూ. 2 లక్షల విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి హైదరాబాదుకు చెందిన ప్రమీల అనేభక్తురాలు రూ.2లక్షలు అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్ తెలిపారు. గురువారం రాత్రి కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి శ్రీమఠం పండితులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాదాచార్, దేశాయ్ నరసింహాచార్, అనంతపురాణిక్, సుజ్ఞానేంద్ర ఆచార్, లక్ష్మీకాంతాచార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాల ఎదుట ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లతో విద్యను అంగడి సరుకుగా మార్చి వేలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు. పుస్తకాల దుకాణాలను పాఠశాలల్లోనే తెరచి అక్షరాలు వెలకట్టి లక్షల రుపాయల వ్యాపారం చేస్తూ దోపిడీకి తెరతీశారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండ జీవో నెంబర్1కి వ్యతిరేకంగా విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్నారని, అంతేగాక అడ్మిషన్లు క్లోజ్ అని బోర్డులు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ విద్యాసంస్థలపై ఎందుకు విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై డీఈవో తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విష్ణు, సమీర్, దస్తగిరి, హాజీ, హఫీజ్, ఖాజా, రమేష్, వీరేష్, రాజు పాల్గొన్నారు.

ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి

● సమైక్యత యాత్రను జయప్రదం చేయాలి

● వామపక్షాల నాయకులు



మాట్లాడుతున్న మండల కార్యదర్శి గోవిందు

ఎమ్మిగనూరు టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశాయి. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్ కార్యాలయంలో వామపక్షాల సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సత్యన్న మాట్లాడారు. దేశ సమగ్రత పరిరక్షణకై మే 30న సమైక్యత యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదం ప్రజలను భయభ్రాంతులను గురిచేసే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దేశ సమగ్రత పరిరక్షణకై రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో సమైక్యత యాత్రలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ యాత్రను ప్రజలు, లౌకికవాదులు, ప్రజాసంఘాలు బలపరచాలని కోరారు. ఎమ్మిగనూరు మండల కేంద్రంలో మే30న ఈ యాత్రను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు బి రాముడు, యు రమేష్, అబ్దుల్లా, బాలరాజు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం తప్పదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్‌యాదవ్, మండల సహాయ కార్యదర్శి రాజీవ్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణంలో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తవుతున్నా ఇప్పటివరకు ఇళ్ల స్థలాలపై స్పష్టత ఇవ్వలేదన్నారు. వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మ, చామంతి, సీపీఐ నాయకులు కేసీజబ్బార్, దాదావలి, మల్లికార్జునగౌడ్, వీరేష్, విజయేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

ఎమ్మిగనూరు టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని వివిధ అభివృద్ధి పనుల ఆమోదం కోసం శుక్రవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా గురువారం మునిసిపల్ కార్యాలయంలో గంగిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో వివిధ అభివృద్ధి పనుల ఆమోదం కోసం చర్చిస్తామన్నారు. సంబంధిత అధికారులు, వార్డు కౌన్సిలర్లు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దు

● ఉపాధి ఏపీడీ లోకేశ్



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ లోకేశ్

మంత్రాలయం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో కూలీలకు పనులు కల్పించి నిక్కచ్చిగా కొలతలు, రైతులకు పండ్ల మొక్కలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ లోకేశ్ అన్నారు. గురువారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఏపీవో భక్తవత్సల ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టాల్సిన పనులు, సాధించాల్సిన ప్రగతి వంటి అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు మేలు చేసే విదంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వర్షాలు మే నెలలోనే ప్రారంభం కావడంతో రైతుల పొలంలో డగౌట్స్ గుంతలు, పండ్ల మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రను విజయవంతం చేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో పనులు కల్పిస్తూ నిక్కచ్చిగా కొలతలతో కూలీలకు పనులకు తగ్గ అధిక కూలీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈసీ రామ్మోహన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మన్న, జితేంద్రరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు సురేంద్ర, రాగమ్మ, ఈరన్న, రంగన్న, ప్రవీణ్ చంద్ర, గోపాల్, వీరరాజు పాల్గొన్నారు.